
అన్నదాతకు కూటమి ప్రభుత్వ సాయం నేటికీ **అందలేదు. ఖరీఫ్** ముగిసి, రబీ ప్రారంభమైనా పెట్టుబడి సాయం **అందక** పోవడంతో అప్పులు చేస్తూ అవస్థలు పడుతున్నారు. అన్నదాత సుఖీభవ నగదు ఇంకెప్పుడిస్తారని ప్రశ్ని స్తున్నారు. మరోవైపు రైతు సేవా కేంద్రాల్లో మొక్క జొన్న విత్తనాలు, డీఏపీ లభ్యం కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కృష్ణాపురంలో మొక్కజొన్న వేయడానికి ట్రాక్టర్‌తో భూమి దున్నుతున్న రైతు

అన్నదాతకు అందని సాయం



పద్మనాభం: రైతులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఆరు నెలలు దాటినా అమలుకు నోచుకోలేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని చంద్రబాబు హామీ ఇవ్వడంతో రైతులు ఆశగా ఎదురు చూస్తూనే ఉన్నారు.

పద్మనాభం మండలంలో 12,007 మంది రైతులు ఉన్నారు. వీరిలో సన్న, చిన్నకారు రైతులే ఎక్కువ. వీరు పంటలపై ఆధారపడి జీవనోపాధి పొందుతుంటారు. ఖరీఫ్‌లో రైతులు 2,683 హెక్టార్లలో వరి పంట వేశారు. పద్మనాభం, ఇసక లపాలెం, కృష్ణాపురం, మద్ది, తునిపాలెం, పాట్నూరు, చిన్నాపురం, నేరేళ్లవలస, బాందేవు పురం, పాండ్రంగి, కోరాడ, ఐనాడ, బి.ఆర్.తాళ్ల వలస, రెడ్డిపల్లి, గంధవరం, పెంట, పి.కొవ్వాడ, కె.కొవ్వాడ గ్రామాల్లో ఈ పంట వేశారు. అధిక శాతం మంది పక్వానికి వచ్చిన **పం** టను కోసి, నూర్పుతున్నారు. ప్ర**భుత్వ**పరంగా పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతన్నలు బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి పంట వేయాల్సి వచ్చింది.



డీఏపీ ఎరువులు లేని మద్ది రైతు భరోసా కేంద్రం

వైఎస్సార్‌సీపీ హయాంలో..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద 17,500 ఖరీఫ్ సీజన్‌లో **పెట్టుబ**డి సాయం అందించేది. ఈ డబ్బుతో బ్యాంకులు, వడ్డీ వ్యాపా**రుల** బారిన పడకుండా పెట్టుబడులు పెట్టుకుని పంటలు పండించు**కు**నే వారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు ఎకరం విస్తీర్ణంలో వరి పం**ట** సాగు చేయడానికి సరిపోయేవి. దీని వల్ల సగం ధాన్యం తినడా నికి ఉంచుకునేవారు. మిగతా సగం పంట అమ్ముకుని వచ్చిన డబ్బులతో రబీ సాగు చేయడానికి పెట్టుబడులు పెట్టుకునేవారు. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు.




మద్దిలో వరి పంట నూర్పుతున్న రైతులు

అందుబాటులో లేని విత్తనాలు, డీఏపీ

ఈ ఏడాది రబీ ప్రారంభమై నెలన్నర గడుస్తున్నా రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం డబ్బులు ఇవ్వపోవడంతో మళ్లీ వడ్డీ వ్యాపారులను, బ్యాంకులను ఆశ్రయి స్తున్నారు. రబీలో దాల్వా వరి, చోడి, మొక్కజొన్న, మినప, పెసర పంటలు పంటలు వేస్తున్నారు. మొక్కజొన్న, చోడి పం టలకు ప్రారంభంలోనే డీఏపీ అవసరం, రైతు సేవా కేం ద్రాల్లో డీఏపీ, మొక్కజొన్న విత్తనాలు లభించ లేదు. వీటి కోసం రైతులు ప్రైవేట్ డీలర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు.

మళ్లీ అప్పు చేయాల్సిందే



నేను ఎకరా విస్తీర్ణంలో సాంబ మసూరి రకం **వరి**పంట వేశాను. వడ్డీ వ్యాపారుల నుంచి వడ్డీకి **రూ.25**వేలు తెచ్చి పంట సాగు చేశాను. పండిన ధాన్యం తినడానికే సరిపోతాయి. ఖరీఫ్ పెట్టుబడి అప్పు తీర్చలేదు. రబీ సీజన్‌లో ఈ ఎకరం విస్తీర్ణంలో చోడి పం ట వేయాలనుకుంటున్నా. దీనికి రూ.15వేలు పెట్టుబడి అవుతుం ది. ఇప్పుడు పెట్టుబడికి మళ్లీ అప్పులు చేయాలి. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌లోనే రైతు భరోసా వేసేది. **వ**ంట సాగు చేయడానికి అప్పు చేయాల్సిన పని ఉండేది **కాదు**. ఇప్పుడు ఖరీఫ్ ముగిసి రబీ ఆరంభమైనా కూటమి **ప్రభు**త్వం పెట్టుబడి సాయం ఇవ్వలేదు. – బి.సన్నిబాబు, మద్ది

మొక్కజొన్న విత్తనాలు లేవు



నేను రబీ సీజన్‌లో 1.50 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేద్దామను **కున్నా**. రైతు సేవాకేంద్రాల్లో మొక్కజొ**న్న విత్తనాలు** లేవు. ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్లి విత్త**నాలు** తీసుకోవల్సి వస్తోంది. సబ్సిడీ లేకపోవడంతో **అధిక** ధరలకు విత్తనాలు కొనలేకపోతున్నాం. ఎకర**న్నర** పొలంలో విత్తనాలకు రూ.3,200 కావాలి. ఇప్పటికైనా ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అందించాలి. – బి.శ్రీను, విలాస్కాన్‌పాలెం

రైతు సేవాకేంద్రంలో డీఏపీ లేదు



వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా సీజన్ ప్రారంభంలోనే విత్తనా లు, ఎరువులను రైతులకు సరఫ రా చేసేవారు. రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులు దాటిపోతుంది. నేను మూడెకరాల్లో ర బీలో దాళ్వా వరి వేయాలనుకుంటున్నాను. వరి పంట వేయడానికి డీఏపీ అవసరం. రైతు సేవా కేంద్రం లో డీఏపీ లేదు. ఇబ్బంది పడుతున్నాం. – జి.పద్మనాభస్వామి, ఇసకలపాలెం

క్లుప్తంగా

హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ, చెన్నై ఆధ్వర్యంలో 2025 ఫిబ్రవరిలో నిర్వహించనున్న లోయర్, హయ్యర్ హిందీ పరీక్షలకు హాజరయ్యేవారు ఫీజు చెల్లించేందుకు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 26 వరకు గడువు పెంచారు. అలాగే రూ.10 అపరాధ రుసుముతో 2025 జనవరి 6 వరకు అవకాశం కల్పించినట్లు భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు

ఘనంగా పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న పాస్టర్లు, కుటుంబ సభ్యులు

తగరపువలస: పాస్టర్స్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు సంగివలసలో మంగళవారం ఘనంగా జరిగాయి. భీమిలి పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌కుమార్ కాటన్, రేవ్ జాకబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ప్రముఖ సేవకులు రెవరెండ్ కె.కుమార్‌రాజు, బిషప్ బాలరాజు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. పాస్టర్లు జాషువా, సంతోష్‌పాల్, ప్రసాద్, బంగారయ్య, రాజబాబు తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి, క్రిస్మస్ గీతాలు ఆలపించారు. కేక్ కటింగ్ అనంతరం ప్రత్యేకవిందు ఏర్పాటు చేసి పాస్టర్లకు కొత్తబట్టలు అందించారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యసిబ్బంది విద్యార్థుల దంతాలను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

గొర్రెల కాపరి ఆత్మహత్య

తగరపువలస: ఆనందపురం మండలం లొడగలవానిపాలెం పంచాయతీ శ్రమజీవుల కాలనీకి చెందిన కంచుబోయిన వెంకటరావు(31)అనే గొర్రెల కాపరి మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంట్లో పైపుకు చీరతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య కొండమ్మ ఈ మేరకు ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భార్య ఇంట్లో లేని సమయంలో రాంబాబు తలుపులు వేసుకుని ఈ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు ఇంటి వెనుక తలుపులు బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించగా అప్పటికే మృతి చెందాడు. సీఐ వాసునాయుడు సూచనలతో ఏఎస్‌ఐ గాంధీ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

గీతంలో సిలికాన్ ల్యాబ్ ఇన్నోవేషన్ సెంటర్

కొమ్మాది: సెమి కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు భారత ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో యూఎస్‌కు చెందిన సెమి కండక్టర్ తయారీ, డిజైనింగ్ సంస్థ సిలికాన్ ల్యాబ్స్ గీతంలో ఇన్నోవేషన్ ల్యాబ్ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లు గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొ. వై.గౌతమ్‌రావు తెలిపారు. ఈ మేరకు సిలికాన్ ల్యాబ్ సీనియర్ డైరెక్టర్ ఎస్. వెంకటేష్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు.

విద్యుత్ పొదుపు పాటించాలి

పీఎం పాలెం: విద్యుత్ వినియోగంలో పొదుపు పాటించాలని విద్యుత్ శాఖ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాలలో భాగంగా సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో విద్యుత్ వినియోగం – పొదుపు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డిప్యూటీ ఈఈ కిరణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ ఏఈలు పాల్గొన్నారు.

లింగ ఆధారిత హింసపై అవగాహన

తగరపువలస: లింగ ఆధారిత హింసపై చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం జరిగింది. నయా చేతన 3.0 కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శ్రీవాణి మాట్లాడుతూ ప్రపంచంలో ప్రబలుతున్న లింగ ఆధారిత హింస అత్యంత మానవహక్కుల ఉల్లంఘన అన్నారు.

రైతుబజారు ఏర్పాటుకు స్థల పరిశీలన

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దరి దుర్గానగర్‌కు సమీపంలో రైతు బజారుకు కేటాయించిన స్థలాన్ని జోన్-2 జోనల్ కమీషనర్ ఫణిరామ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజారుకు ఈ స్థలం అనువైందని పేర్కొన్నారు. త్వరలోనే పనులు చేపడతామని తెలిపారు. ఈ స్థలం రైతు బజారుకు చాలా ఎక్కువ అవుతుందని, ఈ స్థలాన్ని హైస్కూల్ ఏర్పాటుకు వినియోగించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, స్థానిక నాయకులు చెట్టిపిల్లి గోపీ, శాకరి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎండాడలో స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ ఫణిరామ్

రెవెన్యూ అధికారుల తీరుపై అసంతృప్తి

భీమునిపట్నం: భీమిలి తహసీల్దారు కార్యాలయంలో అధికారుల తీరుపై సభ్యులందరూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ తహసీల్దారు కార్యాలయంలో అధికారుల తీరు బాధ్యతారాహిత్యంగా ఉందన్నారు. మండలంలో భూ సర్వేలు సక్రమంగా జరగలేదని, ఒకరి భూమిని మరొకరికి చెందే విధంగా నమోదు చేస్తున్నారని, తనకే ఒక ఎకరం విషయంలో జరిగిందని వైస్ ఎంపీపీ బంగారునాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓబీసీ ధ్రువపత్రాల మంజూరులో చాలా ఇబ్బంది పెడుతున్నారన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

దీనిపై సభ్యులు కూడా అసంతృప్తి తెలియజేశారు. ఆటోల్లో స్కూల్ పిల్లలను అధికంగా తీసుకువెళ్లడంపై తెలియజేయగా ఎంఈవో శివరాణి చర్యలు తీసుకుంటామన్నారు.ఆయా శాఖల అధికారులు నివేదికలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా మెలగాలి

తగరపువలస: ప్రజలకు జవాబుదారిగా వ్యవహరించవలసిన అధికారులు మండల సర్వసభ్య సమావేశంలో కనిపించకపోడంతో ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ మజ్జి ప్రియాంక శారద అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్యసమావేశంలో ఆయన మాట్లాడారు. 26 పంచాయతీలకు చెందిన కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులలో ఎక్కువ మంది ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. దీంతో జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ ముందుగా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయడం నేర్చుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు సమస్యలు చెప్పుకోవడానికి వస్తే అధికారులు లేకపోతే ఎవరికి చెప్పుకొంటారని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటరావు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సభకు ఒంటి గంట వరకు హాజరు కాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో జానకి పాల్గొన్నారు.

సమతుల్య ప్రణాళికలతో పేదరిక నిర్మూలన

పద్మనాభం: స్థానిక వనరుల వినియోగం ద్వారా పేదరికాన్ని రూపు మాపేందుకు పంచాయతీ స్థాయిలో సమతుల్య ప్రణాళికల రూపకల్పన చేయాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులకు లోకలైజేషన్ ఆఫ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంటు గోల్స్ (ఎల్‌ఎస్‌డీజీ) థీమ్స్‌పై రెండు రోజులు నిర్వహించనున్న శిక్షణ తరగతులను మండల పరిషత్ కార్యాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, వెలుగు కార్యాలయాల్లో మంగళవారం ఆయన ప్రారంభించారు. రాంబాబు మాట్లాడుతూ 17 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కె.రాజ్ కుమార్ మాట్లాడుతూ పంచాయతీల సర్వతోముఖాభివృద్ధికి సమతుల్య ప్రణాళికలు ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఈవోఆర్డీ మీనా కుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రాంబాబు

శారదకు సిటూ నాయకుల నివాళులు

తగరపువలస: సీఐటీయూ నాయకురాలు శారద 20వ వర్ధంతి సందర్భంగా నాయకులు ఆమెకు నివాళులర్పించారు. చిట్టివలస సిటూ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో భీమిలి జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ జిల్లాలో అనేక ఉద్యమాలకు శారద నాయకత్వం వహించారన్నారు. ప్రాజెక్టు నాయకులు లక్ష్మి, శ్రీదేవి, పద్మ మాట్లాడుతూ శారద ఆశయాల సాధనకు అందరూ కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు కె.నాగరాణి, నాయకులు పాల్గొన్నారు.

మారికవలస శారదానగర్‌లో..

మధురవాడ: మారికవలస శారదానగర్‌లో శారద వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు.కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షురాలు కొండమ్మ, ఐద్వా నాయకులు బి.భారతి, కె.సుజాత, ఆర్.నారాయణమ్మ పాల్గొన్నారు.

వేతనాల కోసం జీవీఎంసీ కార్మికుల నిరసన

మధురవాడ: జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పలుచోట్ల కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. మధురవాడ జోనల్ కార్యాలయం, 5వ వార్డు స్వతంత్రనగర్‌లలో ఉదయం గంట పాటు ధర్నా నిర్వహించారు. కార్మికులను ఉద్దేశించి సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి. అప్పలరాజు మాట్లాడుతూ తక్షణమే జీతాలు విడుదల చేయకపోతే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్మిక నాయకులు బి.నరసింగరావు, కిరణ్, విజయ్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



పెరిగిన కరెంటు బిల్లులు దహనం చేసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మధురవాడ: ప్రజల సంపదను అదానీకి దోచిపెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని సీపీఎం నాయకులు విమర్శించారు. ప్రైవేటు విద్యుత్ సంస్థలకు లాభాలు చేకూర్చడానికే ఈ రకంగా భారాలు వేస్తున్నారని విమర్శించారు. మధురవాడ కరెంట్ ఆఫీసు వద్ద ఆ పార్టీ మధురవాడ ప్రాంత నాయకులు, శ్రేణులు నిరసన తెలిపారు. పెరిగిన కరెంటు బిల్లులను దహనం చేశారు. సీపీఎం నాయకుడు డి.అప్పలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచబోమని ఎన్నికల సమయంలో చెప్పి ఓట్లు వేయించుకుని, ఇప్పుడు చార్జీలు పెంచడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్లు, పెంచిన కరెంటు చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజ్‌కుమార్, పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

తగరపువలస: భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జిల్లాలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ అన్నారు. ఆనందపురం మండలం కొంత్యాంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది ఈ సదస్సులలో పాల్గొంటున్నందున సమస్యలకు సత్వర పరిష్కారం దొరుకుతుందన్నారు. రేషన్‌కార్డుల్లో పేర్లు చేర్పులు, తొలగింపులు, జనన, మరణాల ధ్రువపత్రాలకు సంబంధించిన దరఖాస్తులు వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. భూమి కొలతలలో హెచ్చుతగ్గులుంటే దరఖాస్తు చేసుకోవడం ద్వారా పరిష్కారం పొందవచ్చన్నారు. గ్రామాలలో భూ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి మళ్లీ కొలతలు వేయవలసి ఉన్నందున 45 రోజుల్లో పరిష్కరించగలరన్నారు. కార్యక్రమంలో భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, తహసీల్దార్ శ్యామ్ ప్రసాద్, లెంక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముబారక్ కాలనీలో 36 వినతులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ ముబారక్ కాలనీ సమీపంలో గల పార్కులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రైవేటు, ప్రభుత్వ స్థలాల సమస్యలకు సంబంధించి 36 వినతులను స్వీకరించినట్లు తహసీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, ఆర్‌ఐ హరితేజ, చెట్టిపిల్లి గోపి, బి.దొరబాబు తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

బుడ్డివలస సదస్సులో 21

పద్మనాభం: మండలంలోని బుడ్డివలసలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 21 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో మ్యుటేషన్ కోసం ముగ్గురు, ఆన్‌లైన్‌లో సబ్ డివిజన్‌కు నలుగురు, సర్వేకు నలుగురు, కులం సర్టిఫికెట్లకు పది మంది దరఖాస్తు చేసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ దరఖాస్తులు స్వీకరించారు. ఆర్‌ఐ శ్యామల, వీఆర్వోలు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

- జనాభా రద్దీకి అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ రోడ్లు
- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

కొమ్మాది: నగరాభివృద్ధిలో భాగంగా, జనాభా రద్దీకి అనుగుణంగా మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉందని జీవీఎంసీ కమిషనర్ డా. పి. సంపత్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు పరిధిలోని నగరపాలెం–బోయపాలెం వరకు ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డును జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ప్రజావసరాల దృష్ట్యా రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న 40,60,100 అడుగుల రోడ్లను అభివృద్ధి పరిచేందుకు వీఎంఆర్‌డీఏ అధికారులతో ఇప్పుడే చర్చించామన్నారు. పూర్తి పరిశీలన అనంతరం, కూలంకషంగా చర్చించి రోడ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ పర్యటనలో జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకరరావు, డీసీపీ హరిదాస్, ఏసీపీ రామకృష్ణ, టీపీవో విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాన్ పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

రైతులకు అందుబాటులో టార్పాలిన్లు

తగరపువలస: తుపాను అప్రమత్త చర్యలలో భాగంగా ఆనందపురం మండలంలో రైతుల వినియోగానికి ఉచితంగా టార్పాలిన్లు అందుబాటులో ఉంచినట్టు ఏవో చావా సంధ్యారత్న ప్రభ తెలిపారు. ఆమె మాట్లాడుతూ తుపాను తీవ్రత తగ్గే వరకు వరిపంట కోతలను వాయిదా వేయాలని పేర్కొన్నారు. కోతలు పూర్తయితే వాటిని కుప్పలుగా పెట్టుకోవాలని సూచించారు. కుప్పల్లో పెట్టిన ధాన్యాన్ని టార్పాలిన్లతో కప్పి ఉంచి జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే మొలకెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. బోని రైతు సేవా కేంద్రం, ఆనందపురం పీఏసీఎస్‌ల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ టార్పాలిన్లను వినియోగం తరువాత తిరిగి వెనక్కి ఇవ్వాలని తెలిపారు.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

పద్మనాభం: ఈ నెల 19, 20 తేదీల్లో తుఫాన్ ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం తెలిపారు. ఐదు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు ఉన్నాయని తెలిపారు. ప్రతి కేంద్రంలో 16 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయని, కావల్సిన రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తీసుకు వెళ్లాలన్నారు.

కనీస పెన్షన్ రూ.9వేలు అమలు చేయాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు కనీస పెన్షన్ రూ.9వేలు అమలు చేయాలని కోరుతూ పెన్షనర్ల సంఘం ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పెన్షన్ల పెంపుదల విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. సీఐటీయూ నాయకులు నిరసనకు సంఘీభావం ప్రకటించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కానూరి రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎన్ మూర్తి, అప్పలరాజు, అప్పారావు, బాబాజీ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న పెన్షనర్లు

హెల్త్‌కార్డులను అన్ని ఆస్పత్రుల్లో అనుమతించాలి

భీమునిపట్నం: ప్రభుత్వ పింఛన్‌దారులకు సంబంధించిన ఆరోగ్య కార్డులను అన్ని ఆసుపత్రుల్లో అనుమతించాలని పింఛన్‌దారుల సంఘం అధ్యక్షుడు టి.భీమారావు కోరారు. పింఛన్‌దారుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పింఛన్ల మంజూరుకు కృషి చేసిన డి.ఎస్.నకారా చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. ముఖ్య సభ్యులు జగన్‌మోహనరావు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు, అప్పారావు, నారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

